# జీవాత్మ

సూర్యదేవర రామ్మోహనరావు

*అర్ధరాత్రి సురద్వేషుడు నిద్ర లేచిన వేళ!*

*లోకం నల్లటి దుప్పటి కప్పుకున్నట్టు అంతటా గాఢాంధకారం ..... ఒంటిని ఒణికిస్తూ చల్లటి గాలులు ..... కీచురాళ్ళ ధ్వనితో ఆ నిశిరాత్రి మారుమ్రోగుతోంది ..... ఉత్తరం వైపు నుంచి నల్లటి మేఘం మదించిన ఏనుగుల గుంపులా దూసుకొస్తోంది .....*

*అదే సమయంలో కుడిచేతిలో చిన్న తోలు సంచీ, ఎడమ చేతిలో తలకిందులుగా వేలాడుతున్న కోడితో -- రాళ్ళూ, రప్పలు నిండిన సన్నని కాలిబాటపై ముందుకు సాగిపోతోందో ఆకారం.*

కన్ను పొడుచుకున్నా ఏమీ కానరాని ఆ దట్టమైన చీకటిలో అతడు సునాయసంగా సాగిపోతున్నాడు. ఎండిన ఆకులు అతడి కాలికింద నలిగి ఆ నిశీథిలో అదో రకం గుబులు పుట్టిస్తున్నాయి.

ఇంతలో ఓ తీతువు భయంకరంగా అరుస్తూ అతని నెత్తిమీదుగా ఎగిరిపోయింది. ఆ నిశిరాత్రిలో ..... ఆ భయంకర వాతావరణంలో మరొకరయితే గుండెలవిసిపోయి మూర్ఛిల్లిపోతారు. మరీ పిరికివాళ్ళయితే గుండాగి ఛస్తారు. కాని అతడు ఏమీ జరగనట్టే ముందుకు సాగిపోతున్నాడు.

శంకరావాసమైన శ్మశానం దగ్గరయిందన్నట్టు శవాలు కాలిన కవురు కంపు అతని నాసికకి తగిలింది.

ఇంతలో సర్ ..... ర్ ..... ర్ మనే సవ్వడికి తన కాలివైపు వంగి చూసుకున్నాడతను.

బారెడు పొడవున్న కాలనాగు మెలికలు తిరుగుతూ తుప్పల్లోకి జారిపోయింది.

అతడు శ్మశానం నడిబొడ్డుకి చేరుకున్నాడు. భూమిలోంచి పైకి పొడుచుకువచ్చిన ఎముకలు, మానవ కంకాళాలు దాటుకుని ముందుకు నడిచాడు.

అతడికి స్వాగతం పలుకుతున్నట్లు సమాధుల వెనుక నుంచి నక్కొక్కటి ఊళబెట్టింది. ఎదురుచూస్తున్న అతిథి రానే వచ్చినట్లు గుబురుకొమ్మల్లోంచి గుడ్లగూబొకటి అతన్నే చూస్తోంది.

శ్మశానం దాదాపు ఒక మైలు విస్తీర్ణం వుంది. ఆ తరువాత తుప్పలు, చెట్లు ..... మరొక వైపు నిరంతరం పారే ఏరు ..... దానిమీద ఎప్పుడో బ్రిటీష్ కాలంనాటి శిథిలమైపోయిన వంతెన .....

అతడు సంచీలోంచి నాలుగు మేకులు తీసి, సంచీని, కోడినీ ఓ చెట్టుకింద పెట్టాడు. క్షుద్రశక్తులు ఆవహించి వుండే వస్తువుల్లో ఇనుము ఒకటని తంత్రశాస్త్రం చెబుతుంది! ఆ

మేకులని శుభ్రపరిచి పూజించాలి! తర్వాత క్రతువు నిర్వహించే స్థలంలో నాలుగువేపులా వాటిని పాతాలి! దాంతో తాంత్రికుడి సాధన సమయంలో ఏ విఘ్నమూ ఏర్పడకుండా రురుడు, కాలుడు, భైరవుడు, భేతాళుడు నాలుగు దిక్కుల్నుంచీ కాపు కాస్తారు.

అతడా మేకుల్ని పట్టుకుని మంత్రాలు పఠిస్తూ ముందుగా దక్షిణం వైపు నడిచి అక్కడ నేలలో పాతాడు. అదే సమయంలో ఎవరో రోదిస్తున్న సన్నని ధ్వని. అతడదేం పట్టించుకోకుండా నైరుతి వైపు నడిచాడు. నేలమీద కూర్చొని రాయితో మేకుని కొట్టసాగాడు. 'హి ..... హి ..... హి' మంటూ మరో వేళాకోళంగా నవ్వుతున్న సవ్వడి.

అతడు ఈశాన్యం వైపు సాగాడు. మేకుని నేలలో కొట్టి లేవబోతుండగా- 'టప్' మని అతని మీద ఏదో పడింది. చలించలేదతను. ఏమిటాని చూశాడు. చచ్చిన ఓ గబ్బిలం. దాన్ని తీసి విసిరేశాడు.

ఇక మిగిలింది ఉత్తర దిక్కు అటు నడుస్తున్నాడతను ..... లీలగా అందెల చప్పుడు ..... అతడొక్క క్షణం అగాడు. అందెల చప్పుడు కూడా ఆగిపోయింది. అతడు తిరిగి నడిచాడు. మళ్ళీ అందెల చప్పుడు మొదలైంది. అయినా అతను ముందుకే సాగిపోయాడు. అందెల చప్పుడూ ఆగకుండా వినిపించసాగింది ..... దగ్గరగా ..... మరింత దగ్గరగా!

అతడు మేకు కొట్టటానికి నేలమీదకి వంగేటప్పటికి అందెల చప్పుడు కాస్తా భీకరమైన హోరులా కర్ణభేరి పగిలిపోయేంతగా మోగసాగింది.

"ఖేటి-భవన్నిఖిల ఖేటీ-కదంబ వనవాటీ" బిగ్గరగా మంత్రాలు పఠిస్తూ ఆఖరి మేకుని కూడా నేలలో పాతేశాడతను. చిత్రంగా ఆ హోరు ఆగిపోయింది. సాధకుడ్ని క్షుద్రదేవతలు ఎన్నో పరీక్షలకి గురి చేస్తాయి! భీతి కలిగిస్తాయి! అవన్నీ జయించిన వాడికే సిద్ధి ప్రాప్తించి క్షుద్ర గణాలు అతడి ఆధీనంలోకి వస్తాయి! ఆ సంగతి తెలుసతనికి!

క్రతువుకి రంగం సిద్ధమయింది-నలువైపులా చూశాడతను. ఎటు చూసినా గాడాంధకారమే. చెట్టు తొర్రల్లో భయంతో మరింతగా ముణగరించుకున్న పక్షుల కువకువలు తప్ప అంతటా నిశ్శబ్దం. మనిషిని భయపెట్టేంత నీరవ నిశ్శబ్ధం.

గాలి స్తంభించిపోయింది ..... ఆకాశమూ, పృథ్వీ, చెట్లూ, చేమలూ - చేష్టలు దక్కి జరుగబోయే తంతు గమనిస్తున్నాయి. చీకటి మరింత చిక్కనవుతోంది.

నిశ్శబ్దంగా ప్రేతాత్మలు అక్కడికి చేరుకుంటున్నట్టు చెట్లలో చిన్న కదలిక.

అరవబోయిన తీతువు ఏదో అజ్ఞాతహస్తం నోరు నొక్కేసినట్లు మిన్నకుండిపోయింది. అతను తిరిగి శ్మశానపు నడిబొడ్డుకి నడిచి సంచీనీ, కోడినీ తీసుకొని మట్టినేలపై ఓ ముగ్గు మండలాన్ని గీశాడు. ఆ మండలంలో ఎనిమిది వృత్తాలున్నాయి.

అతడు దానిలో కూర్చుని తనకెదురుగా మరో ముగ్గు వేశాడు తోలు సంచిలోంచి అక్ష కంకాళము స్త్రీ ముంజేతి ఎముక, కుంకుమ, నిమ్మకాయలు, గువ్వ సాంబ్రాణీ, పిల్లి, ఎలుక, పులి మొదలైన జంతువుల మలం బయటికి తీసి తనకెదురుగా ఉన్న ముగ్గు మధ్యలో పెట్టాడు.

సంచీలోంచి చిన్న తోలుతిత్తి అందుకుని అందులోని నీటితో నోటిని శుభ్రంగా కడుక్కున్నాడు క్రతువు చేసే ముందు సాధకుడి నోట్లో ఏ చిన్న పదార్థమూ వుండకూడదు! అలా వుంటే మంత్రం పఠించేటప్పుడు స్వచ్ఛత లోపించి పట్టు వుండదు.

ఒకసారి గురువుని స్మరించుకుని మనసుని నిశ్చలం చేసుకున్నాడు. దాంతో బుద్ధి పూర్తిగా ఆత్మలో లగ్నం చేయబడుతుంది. దీన్నే 'లయ యోగం' అంటారు. ఇది 'సుషమ్న' లో కుండలినిని జాగృతం చేయడంగా భావిస్తారు. తంత్రలో ఇదొక భాగం. యోగపనిషత్‌లో కూడా బుద్ధిని ఆత్మలో లగ్నం చేయడం చెప్పబడింది. దీనిని యోగలో నాలుగు భాగాలుగా వర్గీకరించారు.

అవి హఠ యోగం, లయ యోగం, మంత్ర యోగం, రాజ యోగం.

క్షుద్రకర్మలు చేసేటపుడు సాధకుడి మనస్సు ఏ మాత్రం చెదిరినా ఎటువంటి అవకతవకలు జరిగినా, గణాధి దేవతలు సాధకుణ్ని ఆవహించి అతడిని పిచ్చివాడిని చేయడంకానీ, అతని రక్తాన్ని పీల్చి వేయడం కానీ చేస్తాయి. ఈ మరణాలు అతి బాధాకరమైనవి వర్ణించలేనివి.

అందుకే తాంత్రిక గురువులు శిష్యులకి చెప్పే మొట్టమొదటి పాఠం ఏకాగ్రతతో బుద్ధిని ఆత్మలో లగ్నంచేసి చేయవలసిన కార్యం మీదే దృష్టిని నిలిపేట్టు మనో సంకల్పబలం పెరిగేలా చేయటం.

మనస్సు నిశ్చలమైనాక ఓ చిన్న చెక్కబొమ్మని తీశాడతను. ఆరంగుళాల పొడవు వుందది. దాని నడుముకి తల వెంట్రుకలు చుట్టి వున్నాయి ఆ బొమ్మకి ముందుగా ఏవో మంత్రాలు పఠిస్తూ కుంకుమ పూశాడతను తరువాత జంతువుల మలం ఆ బొమ్మ మర్మావయం దగ్గర పులిమాడు.

మనిషి శరీరంలో వుండే వాయువులను, ఉపవాయువులను తాంత్రికులు స్పష్టంగా చూడగలుగుతారు! గుండెలో వున్న ప్రాణవాయువు ఆకుపచ్చ రంగులోనూ, కడుపులో ఉండే అపాన వాయువు ఎరుపు రంగులోనూ, బొడ్డు దగ్గరుండే సమానవాయువు తెలుపు రంగులోనూ, చివరి దైన వ్యానవాయువు దీపంలాగా అదే రంగులో వుంటుంది. ఇది శరీరమంతా వ్యాపించి వుంటుంది.

మనిషిని కేవలం బాధ పెట్టదల్చుకుంటే ఉపవాయువుల మీద ప్రయోగం చేస్తే చాలు. ఈ ప్రయోగంవల్ల ప్రాణం పోదు - కొన్ని శారీరక రుగ్మతలు మాత్రమే కలుగుతాయి. ఆగకుండా వెక్కిళ్ళను కలిగించేది నాగ వాయువు, దాహాన్ని కలిగించేది కృకుర, ఎడతెరిపి లేకుండా ఆవలింతలు కలుగజేసేది దేవ దత్త, శరీరాన్ని రోగాలతో శిథిలం చేసేది ధనుంజయ, గుడ్డివాణ్ణి చేసేది కూద్య కానీ అతడు వాటికంటే పెద్ద ప్రయోగమే చేయదలచాడిప్పుడు.

సాధారణంగా తాంత్రికులు తమ శత్రువులపై ప్రయోగం చేయాలంటే స్త్రీలకైతే

నాభిస్థానంలో వుండే 'శంఖీనీ' నాడిమీద, పురుషులకైతే నడుము దగ్గరుండే 'లకుహ' నాడిమీద చేస్తారు.

అతడు స్త్రీ ముంజేతి ఎముకతో ఆ బొమ్మని తాకుతూ- "మహా శబ్దం ప్రకురుతే భీతిదం ద్యాతత్పర: నచిభేతి యదా మంత్రీ తదాదేవి ప్రసీదతి బృహత్కక్షీ, ఊర్ధ్వకేశి, త్రిలోచన, ఖేచరి, చంచలాక్షీ, కాత్లూషా, శత్రునాశినీ" అంటూ మంత్రాలు చదివి ఆ బొమ్మ నడుము చుట్టూ శ్రద్ధగా నూట ఎనిమిది తుమ్మముళ్ళు గుచ్చాడు. అంటే అతడి శత్రువు 'లకుహ' నాడి మీద ప్రయోగం జరిగిందన్నమాట.

ఇంతలో ఆకాశం భయంకరంగా ఉరిమింది. అతడు తల పైకెత్తి చూశాడు. నల్లటి ఆకాశం తారు పులుముకున్నట్లుంది. అతడు తనతో తీసుకొచ్చిన కోడిని చేతిలోకి తీసుకున్నాడు. సంచీలోంచి చాకు తీసి నిర్ధాక్షిణ్యంగా దాని మెడ నరికేశాడు.

అంతే! బుసబుసా నెత్తురు చిమ్మింది. దాని శ్వాస ఆడక టప టపా రెక్కలు, కాళ్ళు కొట్టుకుందది.

కీచురాళ్ళ రొద, కోడి ఆఖరి క్షణంలో ప్రాణవాయువు కోసం చేసిన పోరాటపు ధ్వని ఆ పరిసరాల్ని కంపింపచేశాయి. అతడు నిర్వికారకంగా కోడి మొండెంనుంచి కారుతున్న రక్తాన్ని బొమ్మమీద వెదజల్లి దాని తలని ముగ్గు మధ్యలో నివేదన గావించాడు.

తన సాధన ద్వారా శత్రువుని త్వరగా బాధించాలనుకున్న సాధకులు తమ మంత్రశక్తులతో పాటు ఆ మంత్రాలలో మరింత శక్తి పుట్టించడానికి కొన్ని జీవులను ఛేధించడం ద్వారా మంత్రప్రేరణతో, ప్రకృతిలోని ఆ ప్రాణశక్తిని తమ మంత్రానికి ఆవహింపచేసి దాని ద్వారా అధికశక్తిని సంపాదిస్తారు.

మామూలుగా చేసే పూజలలో కొబ్బరికాయలో అటువంటి శక్తి వుంటుంది మంత్రాన్ని ఉచ్చరిస్తూ, దేవతను స్మరిస్తూ దానిని పగులగొడితే ఆ కొబ్బరికాయలోని జీవశక్తి మంత్రానికి సంక్రమించి దాని ద్వారా సాధకునకు శీఘ్ర ఫలితాన్నిస్తుంది. నారికేళం కంటే గుమ్మడికాయ ఎక్కువ జీవశక్తి కలది.

ఇంక క్షుద్రకర్మలకయితే కోడి, పిల్లి, మేక, గొర్రె, దున్న, ఒంటె, మనిషి శ్రేష్ఠమని తంత్రశాస్త్రం ఘోషిస్తోంది!

ఈ విధంగా సాధన చేస్తే కాళి, తార, ఛిన్న మస్త, భైరవి, కర్ణపిశాచి, బేతాళుడు, భైరవుడు మొదలైన వారి అనుగ్రహం సిద్ధిస్తుంది! అందుకే అతడు కోడిని తన క్రతువుకి వినియోగించుకున్నాడు.

నివేదన తర్వాత ఎండుపుల్లలు తీసి అంటించి నిప్పు రాజేశాడు. అందులో కొన్ని బొగ్గులు వేశాడు. అవి రాజుకున్నాక అందులో సాంబ్రాణి వేసి ఆ ధూపం బొమ్మకి పట్టించి "ఓం ఐ క్లీం సాం-శం క్లీం ఐ శరవణచల్" అంటూ మంత్రం పఠించి దాన్ని గొయ్యి తీసి పాతిపెట్టాడు.

కాలిన చితినుంచి బూడిద తీసుకొచ్చి బొమ్మని పాతిన ప్రదేశంలో పుర్రె ఆకారాన్ని గీశాడు.

ఎర్రని బొగ్గుల లేలేత కాంతిలో సైతం అగ్నిగోళాల్లా మండుతూ తన శత్రువు మీద పగని తెలియజేస్తున్నాయి అతని కళ్ళు. క్రతువు పూర్తవడంతో శిరస్సుని మూడుసార్లు కదిలించాడు.

క్షుద్రశక్తులు దక్షిణం వైపు నుంచి మంత్రగాళ్ళని గమనిస్తాయి. అతడు తన సరంజామాని సర్దుకుని అక్కడినుంచి నిష్క్రమించడానికి ఉద్యుక్తుడయ్యాడు. అప్పుడు వినిపించింది దక్షిణం నుంచి గాలిహోరు అంతవరకూ బంధింపబడి ఒక్కసారిగా విముక్తి గావించినట్లు మనిషిని విసిరేసేలా వీయసాగింది.

ఆ గాలికి భయంకరంగా వూగుతున్న చెట్లు ప్రేతాలు నృత్యం చేస్తున్నట్లున్నాయి. కపాలాల సందుల్లోకి ప్రవేశించిన గాలి "ఊఁ ....." అంటూ - దెయ్యాలు ఏడుస్తున్నట్లుంది!

ఏ ఆధారాలూ లేకుండా ఓ మనిషిని హతమార్చే భయంకర క్షుద్రప్రయోగం చేశాడతను. అదే ..... ఆర్థ్రవటీ ప్రయోగం. దీనికి శత్రువు వాడిన దుస్తులు గానీ, వాళ్ళు తొక్కిన మట్టికానీ, తల వెంట్రుకలు గానీ సేకరించి, ఓ చెక్కబొమ్మకి వాటిలో ఏదో ఒకటి జత చేసి, ఏకాగ్రతతో సాధన చేసి, క్షుద్రదేవతల సాయంతో ఇరవై ఒక్క రోజులు అతడు నరకయాతన పడి మరణించేలా చేయవచ్చు.

అలాంటి భయంకర కార్యం నిర్వహించి అతి మామూలుగా ముందుకు సాగిపోతున్నాడతను. హఠాత్తుగా ఆకాశం మెరిసింది. ఆ మెరుపులో జడలు కట్టిన జుట్టు భుజాల వరకూ జీరాడుతూ, అస్తవ్యస్థంగా పెరిగిపోయిన గెడ్డం, మీసాలతో, శుష్కించిన దేహంతో మొలకు చిన్న అంగీతో అరవై ఏళ్ళు పైబడిన అతని రూపం కాలక్షేపం కోసం స్మశానంలో తిరుగాడుతున్న దెయ్యంలా కన్పించాడతడు..

అతడు రెండడుగులు నడిచాడో లేదో ఆకాశం పెద్దగా ఉరిమింది. అతను నడకవేగం కాస్త పెంచాడు.

'టప్ ..... '

ముందుగా ఒక వాన చినుకు పడింది. చెట్టుతొర్రల్లోని పక్షులు కువకువలాడుతూ మారిన వాతావరణానికి సిద్ధపడసాగాయి.

అతడు మరికొంచెం ముందుకు నడిచాడు. ఇంతలో అతని కాలికి మెత్తగా ఏదో తగిలింది.

అప్పుడే ఆకాశంలో మెరిసిన మెరుపు వెలుగులో కనిపించింది. అదొక మనిషి అరచేయి. పాతిపెట్టిన శవాన్ని నక్కలు తవ్వి తినగా మిగిలిపోయిన ఏ శవానిదో అది. అడుగున ఎముక వరకూ ఎవరో రంపంతో కోసేసినట్టు వుందది. అక్కడక్కడా చర్మం వుందింకా. నల్లగా కమిలిపోయి అసహ్యంగా వుంది. భయంకరమైన చెడువాసన కొడుతోంది.